సాక్షి వరంగల్
ఆదివారం । 14 । జనవరి । 2024





న్యూస్‌రీల్

ఘనంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవుడి కల్యాణం



చెన్నారావుపేట: మండలంలోని లింగగిరి గుట్టపై ఆలయంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఎనిమిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాశీర్వాదంతోపాటు స్వామి వారికి అభిషేక పూజలను అర్చకులు సుమద్రాల సుదర్శనాచార్యులు, రమణకుమారచారి, శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో దొడ్డ వెంకటేశ్వర్లు దంపతులు పాల్గొని పూజలు చేశా రు. అనంతరం భక్తులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలో సర్పంచ్ మాదారపు భాస్కర్, ఉప సర్పంచ్ బూరుగు రాజశేఖర్, మల్లం వేణు, మల్లం సాగర్, వెంకటేశ్వర్లు, కమిటీ బాధ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు పాడి పశువుల అందాల పోటీలు



నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో శాంతి సేన రైతు సంఘం ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) పాడిపశువుల అందాల పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు చిలువేరు కుమారస్వామి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని హైస్కూల్ ఆవరణలో శనివారం పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడారు. డివిజన్‌లోని అన్ని గ్రామాల నుంచి పాడి పశువులు జోడెడ్లు, ఆవు, గేదె, గొర్రెపోతు, మేకపోతు, కుక్క, దూడ, కోడిపుంజు అందాల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, చిలువేరు వెంకటేశ్వర్లు, తౌటి వెంకన్న, రేమిడి శ్రీనివా స్‌రెడ్డి, చిలువేరు కొమ్మాలు, బుర్ర మోహన్‌రెడ్డి, తోట అశోక్, కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

కూచిపూడిలో శ్రీహర్ష గిన్నిస్ రికార్డు


తల్లిదండ్రులతో శ్రీహర్ష

దుగ్గొండి: మండలంలోని దుగ్గొండి గ్రామానికి చెందిన పోలోజు రఘుమూర్తి- లావణ్య దంపతుల కుమార్తె శ్రీహర్ష కూచిపూడి నాట్యంలో ప్రతిభ కనబరిచి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది. 2023 డిసెంబర్ 24న భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలీ స్టేడియంలో ఏకకాలంలో 3,783 మంది కళాకారులు 7నిమిషాలపాటు కూచిపూడి నృత్యం చేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. కళాకారుల బృందంలో పోలోజు శ్రీహర్ష నృత్యం చేసి రికార్డు సృష్టించింది. ఈమేరకు శ్రీహర్షను గురువు పసుపులేటి సరితశ్రీనివాస్, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు శనివారం అభినందించారు.

భోగభాగ్యమే..

సంక్రాంతికి స్వాగతద్వారం భోగి

- పతంగుల కోలాహలం
- బొమ్మల కొలువు, భోగి పళ్లతో సందడి
- నేడు భోగి పండగ

భోగి.. సంక్రాంతి.. కనుమ.. మూడు రోజులు సందడి చేసే పండుగ.. పంటలు ఇంటికి వచ్చాక వచ్చే తొలి పండుగ ఇదే. అందుకే ఊరూవాడ భేదం లేకుండా సంక్రాంతి సంబురాలు అంబరాన్ని తాకనున్నాయి. సంక్రాంతి అంటేనే తెలుగులోగిళ్లలో ఆనంద కాంతులను వెదజల్లే అతిపెద్ద పండుగ. ముఖ్యంగా వరంగల్ నగరంతోపాటు ప్రతి పల్లె పులకించిపోయే సంప్రదాయ వేదిక. చల్లనీ గాలులు, ధాన్యపు రాశులు వీటన్నింటి నడుమ అందంగా నృత్యం చేసే డూడూ బసవన్నలు, హరిలోరంగ హరి అంటూ హరిదాసుల గజ్జెల సవ్వళ్లు, ఇళ్ల ముంగిట కొలువైన రంగవల్లులు, వాటిలోని గొబ్బెమ్మలు, రాణిరుద్రమదేవి పౌరుషాన్ని చూడమన్నట్లు రంకెవేసే ఎద్దులు ఇలా చెప్పుకుంటూ పోతే సంక్రాంతికి ఉన్నన్ని ప్రత్యేకతలు మరే పండుగకు లేవు. అటువంటి సంక్రాంతి లక్ష్మీకి స్వాగత ద్వారం వంటిది భోగి పండుగ. ఆదివారం భోగి పండుగ. ఈ రోజునుంచి ప్రతి ఇల్లూ సంక్రాంతి శోభను సంతరించుకుంటుంది. మహిళలు పిండి వంటల తయారీలో తలమునకలయ్యారు. ఇక చిన్నారులు, యువతీ,యువకుల ఆటలకైతే అంతే ఉండదు. ఆది, సోమ, మంగళవారం ఈ మూడురోజులు నగరంతోపాటు పల్లె పల్లెనా ఆహ్లాదకర వాతావరణం ప్రతి ఒక్కరినీ ఆనందంలో ముంచెత్తుతోంది.

– ఖిలా వరంగల్



భోగిమంటలు..

చలికాలంలో అత్యంత చల్లగా ఉండే రోజు భోగి. అందుకే ఆ రోజున ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేసి చలికాచుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. భగ అనే పదం నుంచి భోగి అనే మాట వచ్చినట్లు చెబుతారు. భగ అంటే వేడి లేదా మంట. ఇక సంవత్సరంలో ఉండే ఉత్తరాయణం, దక్షిణాయనాల్లో భోగి పండుగ, దక్షిణాయనానికి ఆఖరు రోజు. అంటే భోగి మరుసటి రోజు నుంచి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. దక్షిణాయణంలో ఎదుర్కొన్న కష్టాలు బాధలను భోగి మంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ప్రసాదించమని ప్రార్థిచటం కూడా భోగిమంటల్లోని అంతరార్థం.

బొమ్మల కొలువులు.. ఆటపాటలు

ప్రతి ఇంట సందడి చేసేది బొమ్మల కొలువు. మహిళలు భోగి నాటి సాయంత్రం వివిధ రకాలబొమ్మలతో బొమ్మల కొలువును ఏర్పాటు చేసి చుట్టుపక్కల వారిని పిలిచి పేరంటం నిర్వహిస్తారు. పిల్లలకు భోగి పళ్లు పోయటం, మొదలైన వాటితో ప్రతి ఇల్లూ సందడిగా మారుతోంది.

నగర వీధుల్లో భోగి ..

ఉద్యోగ, వ్యాపార రీత్యా, ఎక్కడెక్కడో ఉన్న జిల్లావాసులు సంక్రాంతి సందర్భంగా శనివారం తమ పుట్టిళ్లకు చేరుకున్నారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఆదివారం తెల్లవారు జామునే భోగి మంటలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పండుగతో ఆనందం



సంక్రాంతి అంటే రంగవల్లులే గుర్తొసాయి. పండుగను ఎంతో సంబురంగా చేసుకుంటాం. కుటుంబాల్లో ఎన్ని కష్టాలున్నప్పటికి స్నేహితులంతా చేరుకుంటాం. ఉదయాన్నే ఎవరింటి ముందు వారే పోటీ పడి రంగు రంగుల ముగ్గులు వేస్తాం. ఇదే ఆనందం మళ్లీ పండుగ వచ్చే వరకు ఉంటుంది. కొందరైతే ముగ్గుల పోటీలు నిర్వహించి అందరినీ ప్రోత్సహిస్తున్నారు.

– కామగాని కొమురమ్మ, గృహిణి, వరంగల్

సంస్కృతీ సంప్రదాయాలకు నెలవు



సంప్రదాయాలకు నెలవు ముగ్గులు. సంక్రాంతికి ఇంటి ముందు ముగ్గులే వన్నె తెస్తున్నాయి. సంస్కృతీ సంప్రదాయలకు జీవం ఉట్టిపడేలా ఇంటి ముంగింట్లో చుక్కల ముగ్గులు వేస్తా. తొలి పండుగైన భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజులు ఎంతో సంతోషంగా జరుపుకుంటాం. నూతన బియ్యంతో పాలపొంగులతో మహాలక్ష్మీకి నైవేద్యం పెట్టి ఏడాదిపాటు చల్లగా చూడమని వేడుకుంటాం.

– తోట శ్రీలత
శివనగర్

నందామయ.. గురుడు నందామయ

హరిదాసుల కీర్తనలతో సంక్రాంతి సందడి

- పవిత్ర ధనుర్మాసంలో గ్రామాలు, పట్టణాల్లో పర్యటన
- అక్షయపాత్రలో దోసిళ్లతో భిక్షవేసిన వారికి ఆశీర్వాదం

హన్మకొండ కల్చరల్ :

హరిదాసులు శ్రీవైష్ణవ భాగవతోత్తమ సంప్రదాయానికి చెందిన వారు. శ్రీభగద్రామానుజులు తర్వాత వైష్ణవ గురువులు తెలుగు ప్రాంతాల్లో వైష్ణవ సంప్రదాయాన్ని ప్రచారం చేసినప్పుడు అందరూ ఆకర్షితులయ్యారు. అలాంటి వారిలో మాల దాసరులు, బలిజదాసరులు, గొల్లదాసరులు, మితఅయ్యాళ్ వార్లు తదితరులు ఉన్నారు. పవిత్ర ధనుర్మాసంలో వీరే హరిదాసులుగా మనకు కనిపిస్తారు. వీరు మెడలో తులసీదళాలు, తులసీమాలలు, నుదుట పుండరీకాలు, కాళ్లకు గజ్జెలు, ఒక చేతిలో చిరుతలు, మరో చేతిలో తంబూర, నెత్తిపైన చుట్టుకుదురు పెట్టుకుని దానిపై అక్షయపాత్ర ఉంచుతారు. అక్షయపాత్రను భవనాశి అంటారు. ఒకరికి కేటాయించిన ఊరికి మరొకరు వెళ్లడం నిషేధం.



సంకీర్తనలు పాడుతూ పల్లెలు, పట్టణాల్లో పర్యటిస్తారు. భద్రాచల రామదాసు, ఎడ్ల రామదాసు, పరాంకుశదాసు, వేంకటదాసు, భగవద్భక్తుల కీర్తనలు, నారాయణతీర్థుల తరంగాలను శ్రావ్యంగా ఆలపిస్తారు. నృత్యంతోపాటు శ్రవణానందం, నయనానందం చేస్తుంటారు. మహిళలు తెల్లవారుజామున ముగ్గులు వేసే సమయానికి వీధుల్లో కనిపిస్తూ సంక్రాంతి పండుగకు మరింత వన్నె తెస్తారు. గృహిణులు దోసిళ్ల నిండా ధాన్యం తెచ్చి వారి నెత్తిపై ఉన్న అక్షయపాత్రలో పోస్తారు. ఆ సమయంలో హరిదాసు నేలపై కూర్చొని భిక్షవేసిన వారిని దీవిస్తూ గోవిందా గోవిందా.. కృష్ణార్పణమస్తు అని పలుకుతారు. భిక్షపెట్టమని అడగకపోవడం వీరి ప్రత్యేకత. వీళ్లలో కొంతమంది కొన్నికులాల వారి వివాహాలకు పురోహితులుగా కూడా వ్యవహరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో మితఅయ్యాళ్ వార్లు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మితఅయ్యాళ్ వార్ల కులానికి చెందిన వారిని హరిదాసులుగా వ్యవహరిస్తారు. వీరు ప్రస్తుతం హరికీర్తనల సంప్రదాయాలను వదిలి చిన్నచిన్న వ్యాపారాలు, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా హరిదాసుల జాడే లేకుండా పోయింది. ఆధునిక జీవనశైలితో అద్భుతమైన ఈ కళాసంప్రదాయం పోటీ పడలేక కనుమరుగై పోతోంది.

ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తా..

నాకు 67 సంవత్సరాలు. మా తాతలు భాగవతం ఆడే వారు. హరిదాసులుగా కూడా ధర్మవృత్తి కొనసాగించారు. చిన్నతనం నుంచే హరిదాసు వృత్తిని కొనసాగిస్తున్నా. హరి సంకీర్తనలు చేస్తూ ప్రతిరోజూ చుట్టు పక్కల గ్రామాల్లో పర్యటిస్తా. భగవత్ భక్తులు వారికి తోచిన విధంగా బియ్యం, ధనం అక్షయపాత్రలో వేస్తారు.

– తిరుకోవెల లక్ష్మయ్య,
హరిదాసు, కొప్పుల

హరిదాసులకు సాయం చేస్తున్నాం..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో 250 మితఅయ్యాళ్ వారి కుటుంబాలు ఉన్నాయి. ఈ వృత్తిలో తగిన ఆదాయం లేకపోవడంతో చాలా మంది వారి పిల్లలను ప్రోత్సహించలేక ఇతర పనులకు వెళ్తున్నారు. వంశపారంపర్యంగా వస్తున్న వృత్తి ధర్మాన్ని వీడలేక కొంత మంది మాత్రమే హరిదాసులుగా ఉన్నారు. మా సంఘం నుంచి ఆర్థికంగా వెనుకబడిన వారికి సాయం చేస్తున్నా. హరిదాసుల పిల్లల చదువుకు చేయూత, కుటుంబంలో పెద్ద చనిపోతే ఆర్థిక సాయం అందిస్తున్నాం.

– తాళ్లూరి భిక్షపతి, రిటైర్డ్ ఎస్సై,
మితఅయ్యాళ్ వారి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు

మితఅయ్యాళ్‌వార్లే హరిదాసులు..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గొల్లదాసరులు, మాలదాసరులు ఉండే వారు. రాష్ట్రాల విభజన జరిగిన తర్వాత తెలంగాణ ప్రాంతంలో మితఅయ్యాళ్ వార్ల కులానికి చెందిన వారు మాత్రమే హరిదాసులుగా మిగిలిపోయారు. మేము 31 జిల్లాల్లో తిరిగి సర్వేచేశాం. నేను కుల సంఘానికి న్యాయసలహాదారుగా వ్యవహరిస్తున్నా. మా సంఘం నుంచి కుల అభివృద్ధి, విద్యార్థులకు విద్య, ఉద్యోగాలు కల్పించడంలో కృషి చేస్తాం.

– తిరుకోవెల భిక్షపతి, విశ్రాంత ఉపాధ్యాయుడు, వరంగల్
మితఅయ్యాళ్ వారి సంక్షేమ సంఘం జిల్లా న్యాయసలహాదారు

కళాకారులుగా గుర్తించాలి..



మా వంశపారంపర్యంగా వచ్చిన ఆచారాన్ని నేను స్వీకరించాను. గతంలో ప్రతి పండుగకు జిల్లాలోని వీధులు, కాలనీల్లో పర్యటించేవాడిని. వయస్సు మీరినందున వృత్తి ధర్మాన్ని వీడలేక ప్రస్తుతం గత మూడేళ్లుగా ప్రతి భోగి, సంక్రాంతికి మాత్రమే తెల్లవారుజామున మూడు గంటలకు తయారై హరి సంకీర్తనలు చేస్తూ బయలు దేరుతున్నా. ప్రభుత్వం హరిదాసులను కళాకారులుగా గుర్తించి, పింఛన్ అందించాలి.


– శాత్పడి దామోదర్, హరిదాసు, సుందరయ్యనగర్, వరంగల్

పందేనికి సై



సంక్రాంతి బరిలో కోడి పుంజులు

- పోటీకి ఏపీ నుంచి తెస్తున్న పందెం రాయుళ్లు
- రూ.వేల నుంచి రూ.లక్షల్లో బెట్టింగ్



జనగామ : సంక్రాంతి బరిలో పందెం కోళ్లు సై అంటున్నాయి. పండుగకు ఒకరోజు మిగిలి ఉండడంతో పోటీలకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఏపీ నుంచి తీసుకువస్తున్న కోడి పుంజులతో బరిలో దిగేందుకు సన్నద్ధమవుతున్నారు. భోగి పండుగ నుంచి సంక్రాంతి వరకు బెట్టింగ్‌ల పేర రూ.వేల నుంచి రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. ఇక్కడ పోలీసుల కంట పడకుండా కోడి పందేలు నిర్వహిస్తూ వస్తున్నారు.

జాతకాలు.. ముహూర్తాలు

మనుషులే కాదు.. కోడిపుంజుల్లో జాతులు, వాటి జాతకాలు, పోటీలకు ముహూర్తాలు చూసే వారు కూడా ఉన్నారు. దీనికి ప్రత్యేకంగా కుక్కుట శాస్త్రం ఉంది. కోడి జాతిని బట్టి ఏది కుక్కుటం, ఎలా వెళ్లాలి, ఏ నక్షత్రం, ఏ ముహూర్తంలో పోటీకి వెళ్లాలి అనేది చూసుకుని పందెం రాయుళ్లు పుంజులను బరిలోకి దింపుతారు. కాకి, డేగ, రఫంగి, అబ్రాస్, కక్కిరాయి వంటి పేర్లతో పిలిచే పందెం కోళ్లకు ఒక్కో నక్షత్రంలో గెలుపు ఉందని నమ్ముతారు. పందెం కోళ్లకు ధర కూడా ఎక్కువే. పుంజు జాతి, వాటి సంతతి, గత చరిత్ర, సైజును బట్టి ధర పెరిగే అవకాశం ఉంది.

పందేలకు సిద్ధం

జనగామ జిల్లాలోని జనగామ, బచ్చన్నపేట, పాలకుర్తి, నర్మెట, తరిగొప్పుల,రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, లింగాలఘణపురం మండలాలతో పాటు ఫాంహౌస్‌లు, తోటలు, శివారు,అటవీ ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తారు. అదేవిధంగా ములుగు జిల్లాలోని ఏటూరునాగారం, మంగపేట తదితర ప్రాంతాల్లో జరుగుతాయి. ఇప్పటికే పందెం కోళ్లు చేరుకున్నాయి. పోటీలకు ముందు డమ్మీ కత్తులను కాళ్లకు కట్టి, ఏపుంజులో ఎంత సత్తా ఉందనే దానిపై పందెం రాయుళ్లకు ప్రత్యక్షంగా చూపిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పోటీలో పాల్గొనేవారు దళారులతో కలిసి ముందస్తు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

గాలి పటమా పదపద..	పండుగ వేళ పల్లె జాతర	కళ తప్పిన సూత్రధారులు
పతంగులకు కేరాఫ్ ఎల్లంబజారు	సంక్రాంతి సందర్భంగా ఎడ్లబండ్లు	మూగబోతున్న గంగిరెద్దు గజ్జెలు

- 8లో ▸

విచారణకు ఆదేశం

- 'భూవివాదంలో తగ్గేదేలేదు' కథనానికి కదలిక
- స్పందించిన సీపీ అంబర్ కిశోర్ ఝా
- రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, వరంగల్: భూవివాదంలో తగ్గేదేలేదు అంటూ వర్ధన్నపేట డివిజన్‌లోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) అత్యుత్సాహం ప్రదర్శించారని సాక్షి దినపత్రిలో ప్రచురితమైన కథనానికి వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా స్పందించారు. శనివారం విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ అధికారులు బాధితుల నుంచి సమగ్ర సమాచారం సేకరించి నివేదికను తయారు చేస్తున్నారు. ఇప్పటికే హైకోర్టులో ఉన్న ఈ భూవివాదం వివరాలు తెలుసుకోవడంతోపాటు స్థానికంగా భూమిపై కబ్జాలో ఎవరున్నానే వివరాలు సేకరించారు. ఇద్దరు కానిస్టేబుల్స్ భూమి వద్దకు వెళ్లి విచారించినట్లు తెలిసింది. గతంలో బాధితుడు.. సంబంధం లేని వ్యక్తులు భూమిపైకి వచ్చారంటూ గతంలో ఫిర్యాదు చేయగా.. హైకోర్టులో కేసు ఉండడంతో అక్కడే చూసుకోవాలని, కేసు నమోదు చేయలేమని పోలీసులు తిరస్కరించారు. 2023 డిసెంబర్ 31న రాయపర్తి పోలీసు స్టేషన్‌లో దేవేందర్ ఫిర్యాదు చేసిన కాపీతోపాటు ఇది సివిల్ వివాదం కావున.. పిటిషన్ తిరస్కరిస్తున్నామని జనవరి నాలుగున సెల్ ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌ను కూడా ఇంటెలిజెన్స్ పోలీసులకు అందించినట్లు సమాచారం. ఇప్పటికే విధుల్లో అలసత్వంలో ఉన్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా ఇంటెలిజెన్స్ నివేదిక రాగానే సదరు సీఐపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతోంది.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

నర్సంపేట రూరల్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ ఆధ్వర్యంలో మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గుంటూరుపల్లి ఆయలంలో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేది కాంగ్రెస్ పార్టీయేనని నమ్మి ప్రజలు ఆశీర్వదించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీఠ వేస్తానని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానన్నారు.


జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామప్ప పంప్‌హౌస్ మోటార్ల పరిశీలన

నర్సంపేట: పాకాల తైబందీ సంబంధించి ములుగు జిల్లా రామప్ప పంప్‌హౌస్, పాకాల చెరువులోకి వచ్చే పైపులైన్ పలిగిన ప్రదేశాన్ని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో శనివారం నీటి పారుదల శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయకట్టు ప్రతినిధులు పరిశీలించారు. ఈ మేరకు డీఈ రవీందర్‌రెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బందితో పంప్‌హౌజ్‌లోకి వెళ్లి పాకాలకు నీటిని అందించే రెండు మోటార్ల పనితీరును తెలుసుకున్నారు. అక్కడి నుంచి 3.5కిలో మీటర్ల వద్ద పగిలిన పైపులైన్ మరమ్మతు పనులను కాలినడకన వెళ్లి పరిశీలించారు. డీఈ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలుగు రోజుల్లో మరమ్మతు చేసి మోటార్లను నడిపిస్తామని, యంత్రాలతో కూడుకున్నది కాబట్టి మోటార్ల పైపులైన్ల వద్ద ఎప్పుడు సాంకేతిక ఇబ్బందులు తలెత్తినా నీటిని నిలుపుదల చేయకతప్పదన్నారు. ఏ సమస్య తలెత్తకపోతే 60రోజులు నిరాటంకంగా మోటార్లు నడిపిస్తే 1.20టీఎంసీ నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. పాకాల డీఈ రమేష్, నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రావు మాట్లాడుతూ.. పాకాల సరస్సులో 22ఫీట్ల నీరు ఉందని, మోటార్లు నడిస్తేనే పూర్తి ఆయకట్టులో పంటలు పండటానికి వీలు ఉందన్నారు. ఇక్కడ పరిశీలించిన పూర్తి సమాచారాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, ఖానాపురం మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లగౌడ్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మూడో రైల్వే లైన్ తనిఖీ

● నేటినుంచి 100 కేఎంపీహెచ్‌తో రైళ్లకు గ్రీన్‌సిగ్నల్


ట్రాక్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కాజీపేట రూరల్ : హసన్‌పర్తి–ఉప్పల్ రైల్వే స్టేషన్‌ల మధ్య శనివారం మూడో రైల్వే లైన్‌ను దక్షిణ మధ్య రైల్వే సర్కిల్ కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ (సీఆర్‌ఎస్) మాధవి తనిఖీ చేశారు.10 కిలోమీటర్ మేర ట్రాక్‌ను సీఆర్‌ఎస్ ట్రాలీపై పర్యటించి క్షుణ్ణంగా తనిఖీ చేసి స్పీడ్ టెస్ట్ చేశారు. కొత్తలైన్‌ను పూర్తిగా తనిఖీ చేసి రైల్వే అధికారులతో మాట్లాడి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కొత్త ట్రాక్‌పై 100 కేఎంపీహెచ్‌తో రైళ్ల రాకపోకలకు అథారిటీ ఇచ్చినట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీలో సికింద్రాబాద్ డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్, డిప్యూటీ సీఆర్‌ఎస్ శ్రీనివాస్, సీఈ మోతిలాల్ భూక్యా, సీఏఓ నీరజ్ అగర్వాల్, కాజీపేట డిప్యూటీ సీఈ సజ్జ భార్గవ్‌కృష్ణ, కాజీపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భద్దియా, వివిధ విభాగాల సికింద్రాబాద్, కాజీపేట రైల్వే అధికారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి


నిరసన తెలుపుతున్న కుటుంబీకులు, బంధువులు


వంశీ (ఫైల్)


పవన్ (ఫైల్)

ఎస్‌ఎస్‌తాడ్వాయి /శాయంపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఎస్‌ఎస్‌తాడ్వాయి మండలంలోని గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని నాంపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. పస్రా సీఐ శంకర్ తెలిపిన వివరాలు..హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాకకు చెందిన పోతుగంటి వంశీ, వెల్లూరి పవన్, మామిడి భాస్కర్ తాడ్వాయి మండల కేంద్రంలోని పీఏసీఎస్ నూతన భవనానికి పెయింటింగ్ వేసేందుకు వచ్చారు. కాగా పని నిమిత్తం శుక్రవారం ముగ్గురు కలిసి బైక్‌పై మండలంలోని గంగారం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా నాంపల్లి సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈఘటనలో పోతుగంటి వంశీ(22), వెల్లూరి పవన్(25) అక్కడికక్కడే మృతి చెందారు. మామిడి భాస్కర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం 108 వాహనంలో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు వంశీ తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శంకర్ తెలిపారు. ఇరువురి మృతదేహాలకు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

కాగా, శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి సుధాకర్ ఇంటి ఎదుట ఇరువురి మృతదేహాలతో బాధిత కుటుంబ సభ్యులు శనివారం ఆందోళన చేపట్టారు. బంధువులు శాయంపేట–పత్తిపాక ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై దేవేందర్ సిబ్బందితో అక్కడికి చేరుకొని వారికి సర్ది చెప్పిన వినలేదు. కాంట్రాక్టర్ సుధాకర్‌ను ఇక్కడికి పిలిపించాలని ఎస్సైతో వాదనకు దిగారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో శాయంపేట సర్కిల్ సీఐ మల్లేష్, దామెర, ఆత్మకూరు, పరకాల ఎస్సైలు అశోక్, ప్రశాంత్, శివకృష్ణ సిబ్బందితో చేరుకున్నారు. పెయింటింగ్ పనికి తీసుకెళ్లిన కాంట్రాక్టర్ కూలీలు మృతి చెందితే ఎందుకు బాధ్యత వహించడం లేదని, ఇంటికి తాళం వేసుకొని పారిపోయాడని ఈ ప్రమాదంపై తమకు అనుమానం ఉందని అతన్ని పిలిపించి మాట్లాడాలని కుటుంబ సభ్యులు పట్టుబట్టారు. దీంతో సుధాకర్‌పై ఫిర్యాదు చేస్తే చర్య తీసుకుంటామని సీఐ మల్లేష్ హామీ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆందోళన విరమించి మృతదేహాలను తీసుకెళ్లి ఇంటి ఎదుట రోడ్డుపై బైఠాయించి మళ్లీ ఆందోళన చేపట్టడంతో పోలీసులు మళ్లీ రంగప్రవేశం చేశారు. కుటుంబ సభ్యులు సుధాకర్‌ను వెంటనే తీసుకు వచ్చి తగిన న్యాయం చేయాలని పట్టుబట్టారు. దీంతో సుమారు గంటపై ఉద్రిక్త వాతావరణం చోటుకుంది. చివరికి సీఐ మృతుల కుటుంబ సభ్యులతో సంప్రదింపులు చేసి తమకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో మృతదేహాలను తరలించి దహన సంస్కారాలు చేశారు.

మృతులిద్దరూ ఏకైక కుమారులే..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వంశీ, పవన్‌లు తల్లిదండ్రులకు ఏకైక కుమారులే. పోతుగంటి వెంకటేశ్వర్లు–అనిత దంపతులకు కుమారుడు వంశీ, ఇద్దరు కుమార్తెలు. ఎల్బూరి మొగిలి–జయలక్ష్మి దంపతులకు కుమారుడు పవన్‌తో పాటు కుమార్తె ఉంది. వంశీ, పవన్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి ఆర్తనాదాలు మిన్నంటాయి. తమకు తలకొరివి పెట్టాల్సిన కొడుకులే తమ కళ్ల ముందే చనిపోయారని ఏడుస్తుండడంతో గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు.

పండుగ వేళ.. పల్లెజాతర

పండుగ ఏదైనా తెలంగాణలో సంబురం అంబరాన్నంటాల్సిందే.. సంక్రాంతి వేడుకలకు పల్లెలు సిద్ధమయ్యాయి. ఆడబిడ్డలు పుట్టిళ్లు చేరగా.. లోగిళ్లు రంగవల్లు, గొబ్బెమ్మలతో మురిసిపోగా.. భోగి పళ్లు, పిండి వంటలతో కుటుంబాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి వేళ నిర్వహించే జాతరలకు ఆలయాలు సిద్ధమవగా.. మొక్కులు చెల్లించేందుకు ప్రజలు బయల్దేరారు.

భోగి పండుగ రోజు కుమ్మరి బోనం

ఎల్కతుర్తి : ప్రతీ ఏటా సంక్రాంతి రోజు కొత్తకొండ వీరభద్రస్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ జాతరకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

నేటి జాతర ప్రత్యేకత..

నేడు భోగి పర్వదినం సందర్భంగా కొత్తపల్లికి చెందిన కుమ్మరి కులస్తులు వీరబోనంతో(మట్టికుండలో బెల్లంతో కూడిన నైవేద్యం) పెద్ద ఎత్తున ఊరేగింపుగా స్వామి వారి ఆలయానికి చేరుకుంటారు. వీరభద్రుడికి నైవేద్యం సమర్పించడంతో పాటు వారి ఆలయం చుట్టూ బండ్లు తిప్పిన అనంతరం మిగతా బండ్లు తిరుగనున్నట్లు ఆలయ అర్చకుడు రాంబాంబు తెలిపారు. ఇలా చేయడం వల్ల స్వామి వారు కోరిన కోర్కెలు తీర్చడంతో పాటు పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల విశ్వాసం.అలాగే శనివారం స్వామివారికి లక్ష బిల్వార్చన పూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈఓ కిషన్‌రావు మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

కొత్తకొండకు ప్రత్యేక బస్సులు


కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం

హన్మకొండ : భీమదేవరపల్లి కొత్తకొండ వీరభద్రుడి జాతరకు నేటినుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వరంగల్ డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. హనుమకొండ, హసన్‌పర్తి, ఎల్కతుర్తి, ముల్కనూర్ మీదుగా కొత్తకొండకు బస్సులు నడుస్తాయన్నారు. చార్జీలు పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30గా నిర్ణయించామన్నారు.


బోనాలతో కుమ్మరులు (ఫైల్)

యేనే రామ నర్సింహస్వామి జాతరకు వేళాయె..

పెద్దవంగర : ఎత్తైన గుట్టు.. చుట్టూ ప్రకృతి అందాలు.. గుట్టపైకి వెళ్లేందుకు ఇరుకైన దారి.. ఆ దారి గుండా వెళ్తే పచ్చని తోరణాలతో కనిపించే వృక్షాలు. అటువంటి ప్రకృతి అందాల నడుమ యేనే రామ నర్సింహస్వామి కొలువు తీరాడు. ప్రతి ఏడాది సంక్రాంతికి జాతర జరుగుతుంది. తమ ఇష్టదైవమైన యేనే రామ నర్సింహస్వామి దర్శించుకునేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు మండలాల పరిధిలోని ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

గుట్టపై ఓ చెట్టు కింద..

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని జాతరను ఒక్క రోజు ఘనంగా నిర్వహిస్తారు. ఎన్నో దశాబ్దాల క్రితం గ్రామ శివారులోని ఓ గుట్టపై చెట్టు కింద రాముడు కొలువు దీరాడని భక్తులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. గుట్టపై విష్ణు భగవానుడు నరసింహస్వామి అవతారం అనంతరం రామావతారంలో ఇక్కడ వెలిశాడని దీంతో యేనే రామ నర్సింహస్వామిగా ప్రతి ఏటా సంక్రాంతి రోజును భక్తులకు దర్శనమిస్తున్నాడు. భక్తుల తాకిడి అధికమవడంతో 25 ఏళ్ల క్రితం గ్రామస్తులు విరాళాలు సేకరించి ఆలయాన్ని నిర్మించారు. జాతరలో ఎడ్లబండ్ల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.


గుహలో కొలువైన స్వామివారు, పక్కన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలు



సంక్రాంతి అంటే ఎడ్లతో జాతర..

పాలకుర్తి : సంక్రాంతి పర్వదినం వేళ ఎడ్లబండి కట్టి ఎల్లవ్వ జాతరకు వెళ్లి దర్శనం చేసుకునే సంప్రదాయం బమ్మెరలది. గ్రామం నుంచి సుమారు 150 మంది రైతులు ఎడ్లబండ్లను అలంకరించి ఊరేగింపు కోసం తయారు చేస్తారు.

కొమురప్ప కల సాకారమే బంజర మల్లన్న జాతర

దేవరుప్పుల : జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పెద్దమడూరుకు చెందిన కురుమ సామాజిక వర్గానికి చెందిన శివభక్తుడు జోగు కొమురప్ప 150 ఏళ్ల కిందట చిన్నమడూరు శివారు బంజరలో వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. ఈ క్రమంలోనే కొమురప్పకు కలలో శివుడు వచ్చి కొమురవెల్లి మల్లన్న తరహాలో మల్లికార్జునస్వామి వెలిస్తే సుఖసంతోషాలతో ఉంటారని కొమురప్పకు చెప్పడంతో తొలుత బండలతో గుడిచేసి తంగేడు పూలు పెట్టి పూజ చేశారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని బంజర మల్లన్నను కొలిస్తే కోర్కెలు తీరుతున్నాయని ప్రత్యేక పూజలతో జాతర నిర్వహిస్తున్నారు.ఈ జాతరకు వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాలకు చెందిన శివభక్తులు ఎడ్లబండ్లపై వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.


కొలువుతీరిన కోరమీసాల బంజర మల్లన్న

జోగు వారసత్వంగా జాతర నిర్వహణ



తాత ముత్తాల నుంచి వస్తున్న వారసత్వంగా కొమురప్ప ఆశయాలను నెరవేర్చేందుకు ఏటా భోగి, సంక్రాంతి పండుగ నిర్వహిస్తున్నాం. ఈ బంజర మల్లన్నకు మొక్కులు చెల్లించుకుంటే సంతానం లేని వారికి అనుగ్రహం లభిస్తోందనే నమ్మకం ఉంది. కొమురెల్లి, ఐనవోలు దేవళ్లకు తీసిపోకుండా ఇక్కడ శివుడి ఆశీర్వాదాలు అందుతాయి.

-జోగు సోమయ్య, పెద్దమడూరు(దేవరుప్పుల)

నేటినుంచి మల్లికార్జునస్వామికి బోనాలు, పట్నాలు


మల్లికార్జున స్వామి మూల విరాట్

సంగెం : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆశాలపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామికి నేటినుంచి భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు. వందల ఏళ్ల క్రితం మండలంలోని ఆశాలపల్లి శివారులో బండరాళ్ల మధ్యన వెలసిన మల్లికార్జునుడికి వైభవంగా భక్తులు పూజలు చేస్తారని పెద్దలు చెబుతున్నారు. ఆశాలపల్లి, కాట్రపల్లి, గవిచర్ల గ్రామాల శివారు కలిసిన చోట ఆశాలపల్లి పొలిమేరలో కొలువైన మల్లికార్జునస్వామికి ఏటా జాతర నిర్వహించే వారని పెద్ద పట్నాలు, బోనాలు, ఎడ్లబండ్లతో ఊరేగింపుతో దర్శించుకుని తరించేవారని ప్రతీతి. కాట్రపల్లి, ఆశాలపల్లి ఓగ్గువారి మధ్య పొడచూపిన విభేదాల వల్ల అక్కడ పూజలు లేకపోవడంతో అలిగిన మల్లికార్జునస్వామి కొమురవెల్లికి వెళ్లిపోయాడని ప్రచారంలో ఉంది. కాగా దాతల సాయంతో 2018లో నూతన దేవాలయ నిర్మాణంతో పాటుగా మల్లికార్జున స్వామిని పునఃప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఉగాది వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ కూచన సమ్మయ్య, ఆశాలపల్లి సర్పంచ్ బొల్లెబోయిన కిశోర్‌యాదవ్, ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు.

ఆనవాయితీగా ఎడ్లబండ్ల ఊరేగింపు


మండలకేంద్రంలో ఎడ్లబండ్ల ఊరేగింపు (ఫైల్)

తరిగొప్పుల : మండలకేంద్రంలో ప్రతీ ఏడాది అర్జుల కులస్తులు ఎడ్లబండికి పూజలు చేసి బండ్లు తిరిగే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అలాగే నర్సాపూర్ నుంచి ఎడ్లబండ్లతో స్థానికులు మండలకేంద్రం చేరుకొని కుటుంబ సభ్యులతో ఆంజనేయ స్వామిగుడి నుంచి మొదలుకొని శివాలయం, చెన్నకేశవ ఆలయం, పోచమ్మ గుడి, మార్కండేయుని గుడిని దర్శించుకుంటూ గ్రామమంతా ఊరేగిస్తారు.

కళ తప్పిన సూత్రధారులు

● మూగబోతున్న గంగిరెద్దు గజ్జెలు
● అంతరించిపోతున్న ఆచారం
● సంక్రాంతి వేళ మాత్రమే బసవన్న ఆటపాట

వేలేరు : సంక్రాంతి వచ్చిందంటే గంగిరెద్దుల వారికి పండుగే. బసవన్నకు గజ్జెలు కట్టి, రంగురంగుల వస్త్రాలతో అందంగా అలంకరించి సన్నాయి ఊదుతూ ఊరూరా తిరుగుతూ సందడి చేస్తారు. పండుగ వేళ ఇళ్ల ఎదుట సందడి చేసే గంగిరెద్దుల ఆటపాటలు నేటి ఆధునిక ప్రపంచంలో కనుమరుగవుతున్నాయి.

గంగిరెద్దుల వారి జీవన నేపథ్యం

వేలేరు మండలంలోని మద్దెలగూడెం గ్రామంలో 30 గంగిరెద్దుల కుటుంబాలు నివసిస్తున్నారు. వందేళ్ల క్రిత మే యాదగిరిగుట్ట దగ్గరలోని కందుకూరు నుంచి మద్దెలగూడేనికి వలస వచ్చారు. గంగిరెద్దుల వారికి ప్రభుత్వం 1998లో సుమారు 2 ఎకరాల స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ఇక్కడ ఉండే యువకులు, పెద్దలు కలిసి సంక్రాంతి పండుగ సమయంలో బసవన్నల ను ఆడిస్తే తలా రూ.2 వేల నుంచిరూ. 5 వేల వరకు స ంపాదిస్తుంటారు. ఇక్కడి నుంచి ముప్పారం, నర్మెట, ఉప్పుగల్లు, వెంకటాద్రిపేట గ్రామాలకు వలస వెళ్లి జీవనాన్ని కొనసాగిస్తున్నారు.


బసవన్నను ఆడిస్తున్న గంగిరెద్దులవారు

ప్రభుత్వం ఆదుకోవాలి



తాతల కాలం నుంచి మేము గంగిరెద్దులను ఆడిస్తూనే బతుకుతున్నాం. మాకు ఏ ప్రభుత్వంలో న్యాయం జరగలేదు. నాయకులు ఓట్లు వేయించుకోవడానికే మా ఇళ్లవైపు వస్తారు. ఓట్లు అయిపోగానే మమ్మల్ని పట్టించుకునే నాథుడే ఉండడు. ప్రభుత్వం గుర్తించి సాయం చేస్తే కష్టాలు తీరుతాయి. మాలో కొంతమందికి 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇచ్చింది. అవి ప్రస్తుతం కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్రభుత్వమైనా మాకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

- బత్తుల మల్లయ్య, పెద్దమనిషి

పిల్లలను చదివిస్తాం..



కులవృత్తిలో భాగంగా నా భర్త గంగిరెద్దులను ఆడిస్తాడు. సంక్రాంతి సమయంలో గంగిరెద్దులను ఆడించడంతో పండగ ఖర్చులు వస్తాయి. మిగతా సమయాల్లో ఊరూరికి తిరిగి బీరువాలు, గ్యాస్ పొయిలు, మిక్సీలు రిపేర్లు చేస్తు వచ్చే డబ్బుతో కుటుంబ పోషణకు ఇస్తాడు. మేము చదువుకోలేక కుల వృత్తిని చేస్తున్నాం. మా పిల్లలకు మాత్రం మంచిగా చదివిస్తాం..

- జిడ్డి మణెమ్మ

కనుమరోజు పెర్కవేడు మల్లన్న జాతర


పట్నం వేస్తున్న భక్తులు (ఫైల్)

రాయపర్తి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కనుమరోజు నిర్వహించే మల్లికార్జునస్వామి జాతరకు భక్తులు, ప్రజలు పోటెత్తనున్నారు. పెర్కవేడు గ్రామంలో ప్రతీ ఏటా భోగి, సంక్రాంతి అనంతరం కనుమ రోజున మల్లికార్జున స్వామికి ఎడ్లబండ్లు, గొర్రెపొట్టేళ్ల బండ్లను కట్టి శోభాయాత్రను నిర్వహిస్తారు. మర్రిచెట్టు కింద పట్నం వేస్తారు. తాము కోరిన కోర్కెలను తీర్చాలని భక్తిశ్రద్ధలతో పట్నం వేసి మొక్కులు చెల్లిస్తారు. ఈఏడాది జాతర నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గాలి పటమా పదపద..


అన్న.. నీకో కైట్.. నాకో కైట్

● పతంగులకు కేరాఫ్ ఎల్లంబజారు
● 100ఏళ్లుగా అమ్మకాలు
● ప్రతీ ఏడాది సంక్రాంతికి జోరుగా విక్రయాలు
● అన్ని రకాల గాలిపటాలు అందుబాటులో..

కాజీపేట అర్బన్: గాలి పటమా పదపద అంటూ చంద్రముఖి సినిమాలో రజినికాంత్ పాడిన పాటను తలపించేలా ప్రతీ సంక్రాంతికి చిన్నారులు, యువత వరంగల్ ఎల్లంబజారుకు వెళ్లాల్సిందే.. అక్కడ వందేళ్లుగా పలువురు వ్యాపారులు రంగురంగుల గాలి పటాలను విక్రయిస్తు ఆకట్టుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు కైట్స్ కొనుగోళ్లతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా కనిపిస్తోంది. మహిళలు పిండి వంటకాల్లో నిమగ్నమైపోతే, యువకులు, చిన్నారులు మాత్రం అక్కడ కొనుగోలు చేసిన పతంగులను ఎగరేస్తూ ఆనందంగా గడుపుతుంటారు.


ఎల్లంబజార్‌లోని గాలి పటాల విక్రయాల షాప్స్

ఆకాశమే హద్దుగా..


సంక్రాంతి పండుగకు గాలి పటాలు ఎగిరేయడం ప్రత్యేకత. గాలి పటాలు ఎగిరేసే వారికి ఉత్తేజాన్నిచేందుకు గాను సింగర్ రోల్ రైడా పాడిన డీజేల పాటలు మార్మోగుతుంటాయి. దీంతో నగర యువత మైదానాలు, ఇంటి డాబాలపై గాలి పటాలను ఎగురవేస్తూ బయ్యా.. నా పతంగ్‌తో నీపతంగ్‌కు పోటా.. అంటూ గాలి పటాలు ఎగరేస్తూ పండుగను సంబురంగా జరుపుకుంటారు.

అన్ని రకాల పతంగులు..

నగరంలోని ఎల్లంబజార్‌లో అన్ని రకాల పతంగులను విక్రయదారులు తీసుకొచ్చి అమ్ముతుంటారు. పేపర్, ప్లాస్టిక్ పతంగులతో పాటు వాటిని ఎగురవేసే దారం మాంజాతో పాటు ఇతర రకాలవి సైతం అక్కడ అమ్ముతుంటారు. వివిధ రంగులతో కూడిన అందమైన కైట్స్ యువతకు, కార్టున్స్‌లోని బొమ్మలతో కూడిన పతంగులు చిన్నారులను ఎంతో ఆకర్షిస్తున్నాయి.



2 పైసల నుంచి పతంగుల అమ్ముతున్నా..



సంక్రాంతి పండుగ వచ్చిందంటే పతంగుల కోసం నగరవాసులు మా వద్దకు వస్తుంటారు. 45 ఏళ్లగా పతంగులు విక్రయిస్తున్నాం. 2 పైసల పతంగుల నుంచి ప్రతీ సంక్రాంతి పండుగకు గాలి పటాలను అమ్ముతూ వస్తున్నాం. ప్రస్తుతం రూ.5 నుంచి 25 రూపాయల వరకు పతంగులు అందుబాటులో ఉన్నాయి. సంక్రాంతి పండుగకు పతంగులను అమ్మడం చాలా ఆనందంగా ఉంటుంది.

- సీహెచ్.చందు, ఎల్లంబజార్, వరంగల్

మా ఫ్రెండ్స్‌తో సరదాగా..



ప్రతీ ఏడాది సంక్రాంతి పండుగకు మా ఫ్రెండ్స్‌తో కైట్స్‌ను సరదాగా ఎగురవేస్తాను. నాకు కైట్స్‌కు దారం కట్టడం రాదు. దీంతో మా ఫ్రెండ్స్ చక్కగా కట్టి ఇస్తారు. దీంతో మాంజాతో కూడిన చరాక్‌ను పట్టుకుని ఎంజాయ్‌గా గాలిపటం ఎగురవేస్తాను.

- శ్రీవాస్తవ, కొత్తవాడ, వరంగల్